క్లుప్తంగా

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి



చదును చేస్తున్న ట్రాక్టర్

సుల్తానాబాద్: పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ కోరారు. గురువారం సుల్తానాబాద్ పట్టణంలోని గట్టెపల్లి రోడ్డుకు ఇరువైపులా ఉన్న పిచ్చిమొక్కలను ట్రాక్టర్ ద్వారా తొలగించారు. ఇంటి చుట్టుపక్కలా పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. పిచ్చిమొక్కలు పెరగడంతో విష పురుగులు వచ్చే అవకాశం ఉందని, వాటిని రాకుండా నివారించాల్సిన బాధ్యత ప్రజలపై కూడా ఉందన్నారు. కార్యక్రమంలో సిబ్బంది శ్రావణ్ కుమార్ ఉన్నారు.

చలో హైదరాబాద్ విజయవంతం చేయాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

జూలపల్లి: హైదరాబాద్‌లో ఈ నెల 11న ఎస్సీ వర్గీకరణ కోరుతూ నిర్వహించనున్న బహిరంగ సభకు మాదిగ ఉపకులాలు తరలి వెళ్లేందుకు సిద్ధం కావాలని ఎంఎస్పీ జిల్లా కన్వీనర్ అంబాల రాజేందర్ పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లో నిర్వహించే విశ్వరూప మహాసభ పోస్టర్‌ను మండల కేంద్రంలో గురువారం నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బహిరంగ సభకు పీఎం నరేంద్ర మోడీ ముఖ్య అతిథిగా హాజరు కానున్నందున ప్రతీ గ్రామంలోని మాదిగ ఉపకులాలకు చెందిన వారు పాల్గొనేందుకు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో మండల ఇన్‌చార్జి తాండ్ర శ్రీనివాస్, నాయకులు రామస్వామి, సీపెల్లి అంజయ్య, సిరిసిల్ల శంకర్, మల్లేశ్, సాగర్, వివేక్, నవీన్, ఆకాశ్ తదితరులు ఉన్నారు.

గుంతలమయంగా రోడ్డు



ప్రమాదకరంగా ఉన్న నర్రాశాలపల్లె రోడ్డు

జ్యోతినగర్: నిత్యం ప్రజలు సంచరించే రోడ్డు సక్రమంగా లేకపోవడంతో పలు ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉంది. రామగుండం కార్పొరేషన్ ఐదో డివిజన్‌లోని నర్రాశాలపల్లె రోడ్డు పూర్తిగా గుంతమయమైంది. దీనికి తోడు ఇటీవల నిర్మించిన ఓ కల్వర్టు ఎత్తుగా ఉండటం, దాని పక్కనే పెద్ద మురుగు కాలువ ఉంది. దీంతో వాహనదారులు ప్రమాదానికి గురయ్యే అవకాశాలు ఉన్నాయి. సంబంధిత అధికారులు కల్వర్టు ఎత్తుకు సరిపడా రోడ్డును నిర్మించడంతో పాటు మురుగు నీటి కాలువను నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ



పౌష్టికాహారం అందజేస్తున్న డాక్టర్ లక్ష్మీవాణి

ఫెర్టిలైజర్‌సిటీ: కార్పొరేషన్ రామగుండం కార్పొరేషన్ 14వ డివిజన్ లక్ష్మీపురం పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రధానమంత్రి సురక్షిత్ మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గురువారం గర్భిణులకు డాక్టర్ లక్ష్మీవాని వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. గర్భిణులకు పండ్లు, పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సరళి, సీవో పారిజాతం, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు అందించే వారికే మద్దతు

జ్యోతినగర్: 'ప్రభుత్వ పథకాలు అందించే వారికే మా మద్దతు' అని రాష్ట్ర గాండ్ల కుల వృత్తి నూనె ఉత్పత్తిదారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు జక్కం మారుతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నూనె విత్తనాల నుంచి ఎద్దుగానుగతో సంప్రదాయబద్ధంగా నూనె తీసే కులవృత్తి కుటీర పరిశ్రమదారులుగా గాండ్ల కులస్తులు కొనసాగుతున్నారని అన్నారు. గాండ్ల కులానికి కార్పొరేషన్, కులవృత్తితో జీవనాధారం పొందుతున్న వారికి విద్యుత్ బిల్లులో రాయితీ కల్పించాలని కోరారు. గాండ్ల కులస్తులకు ప్రభుత్వ పరంగా లభించే సదుపాయాలను అందిస్తామని హామీ ఇచ్చే వారికే తమ మద్దతు ఉంటుందన్నారు. గాండ్లకులస్తుల హక్కుల సాధన కోసం సంఘాలకు, పార్టీలకు అతీతంగా ముందుకు రావాలన్నారు.

నో.. స్పీడ్ బ్రేకర్స్

- అసంపూర్తిగా డివైడర్ పనులు
- రాజీవ్ రహదారిపై తరచూ ప్రమాదాలు
- పట్టించుకోని అధికారులు



రోడ్డు మధ్యలో అసంపూర్తిగా ఉన్న డివైడర్

జ్యోతినగర్: ప్రధాన రాజీవ్ రహదారిలో ఉన్న మేడిపల్లి సెంటర్ నుంచి భరత్‌నగర్ బోర్డు వరకు ఎక్కడా స్పీడు బ్రేకర్లు లేకపోవడం, రోడ్డు మధ్యలో నిర్మించిన డివైడర్లు అసంపూర్తిగా ఉండడంతో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. అయినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. రామకృష్ణ థియేటర్ మూలమలుపు, దుర్గయపల్లె స్కూల్ ఎదురుగా, రావూస్ మై టెక్నో స్కూల్ ఎదురుగా ఉన్న మలుపులో వాహనాలు వేగంగా రావడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. అలాగే ఈ ప్రాంతంలోని వ్యాపారస్తులు పగటి పూట భారీ వాహనాలను రోడ్డుపై నిలిపి వస్తువులను అన్‌లోడ్ చేయడంతో ట్రాఫిక్ సమస్య పెరుగుతోంది. ఎన్టీపీసీ రామగుండం రాజీవ్ రహదారి మేడిపల్లి సెంటర్ నుంచి భరత్ నగర్ బోర్డు వరకు ఆర్‌అండ్‌బీ నిర్మించిన ప్రధాన రహదారిలో ఎక్కడా స్పీడు బ్రేకర్లు లేకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి.

నిత్యం వాహనాల రద్దీ..

మేడిపల్లి సెంటర్ నుంచి భరత్‌నగర్ బోర్డు వరకు రోడ్డు వేశారు. దీంతో మేడిపల్లి గ్రామంతో పాటు ఇందిరమ్మకాలనీ, న్యూపీకే రామయ్యకాలనీ, మేడిపల్లి ఓపెన్‌కాస్టు ప్రాజెక్టు, న్యూపోరట్‌పల్లి నుంచి రోజుకు వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. నిత్యం వాహనాల రద్దీతో కాలనీవాసులు భయంభయంగా గడుపుతున్నారు. స్పీడ్ బ్రేకర్ లేకపోవడం, రోడ్డు మధ్యలో అంసపూర్తిగా డివైడర్లు ఉండడంతో వాహనాలు రోడ్డు దాటే సమయంలో పలుమార్లు ప్రమాదాలు కూడా చోటు చేసుకుని తీవ్రగాయాలు అయిన సందర్భాలు ఉన్నాయి.

అసంపూర్తిగా డివైడర్ పనులు..

ఆర్‌అండ్‌బీ అధికారుల పర్యవేక్షణలో మేడిపల్లి సెంటర్ నుంచి భరత్‌నగర్ బోర్డు వరకు రోడ్డు మధ్యలో నిర్మించిన డివైడర్ పనులు అర్ధంతరంగా ముగియడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒకచోట నిర్మాణం, మరో చోట వదిలివేయడం వంటివి చేయడంతో కూడా చాలామంది రోడ్డు క్రాస్ చేసే సమయంలో ప్రమాదాలకు గురవుతున్నారు. రోడ్ మధ్యలో నిలిపిన డివైడర్ పనులు పూర్తిచేయడంతో పాటు స్పీడ్ బ్రేకర్లు వేసి ప్రమాదాలను నియంత్రించాలని ప్రజలు కోరుతున్నారు.

స్పీడ్ బ్రేకర్లు లేకపోవడంతో..



మేడిపల్లి సెంటర్ నుంచి భరత్‌నగర్ రోడ్డుపై వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుంది. ఎన్టీపీసీ రామగుండం, రామగుండం ఎరువుల కర్మాగారంలో పని చేసే కార్మికులు, ఉద్యోగులు ప్రయాణిస్తారు. స్పీడ్ బ్రేకర్లు లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి.

– గీట్ల లక్ష్మారెడ్డి, సీపీఎం నాయకుడు, ఎన్టీపీసీ రామగుండం

పూర్తిస్థాయిలో డివైడర్లు నిర్మించాలి



మేడిపల్లి రోడ్డు నుంచి భరత్‌నగర్ వరకు ఉన్న రోడ్డు మధ్యలో పూర్తిస్థాయిలో డివైడర్లు నిర్మించాలి. వదిలి వేసిన డివైడర్లకు ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి. సెంట్రల్ లైటింగ్ సిస్టం పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయాలి.

– ఎండీ రహీం, జిల్లా కార్యదర్శి, డీసీసీ, పెద్దపల్లి

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ధర్మారం: మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో ఇంటర్ చదువుతున్న పలువురు విద్యార్థులు రాష్ట్రస్థాయి అండర్–19 ఎస్‌జీఎఫ్ వాలీబాల్, బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు కొమురయ్య తెలిపారు. కరీంనగర్‌లోని అంబేద్కర్ స్టేడియంలో జరిగిన హ్యాండ్‌బాల్ పోటీల్లో శ్రావ్య, అక్షర, బాస్కెట్ బాల్ పోటీల్లో గౌతమి, స్రవంతి స్వప్న, సిద్దార్థ ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయిలో ప్రతిభ కనపరిచి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు ఆయన వివరించారు. కొడిమ్యాల మండల కేంద్రంలో జరిగిన ఎస్‌జీఎఫ్ అండర్–19 పోటీల్లో అభిరామ్, కీర్తన హ్యాండ్‌బాల్, బాస్కెట్ బాల్ పోటీల్లో రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థులు ఈ నెల 11 నుంచి 13 వరకు మహబూబ్‌నగర్‌లో జరిగే రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్ పోటీల్లో, సిద్దిపేటలో 10 నుంచి 12వ తేదీ వరకు జరిగే అండర్–19 రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని కొమురయ్య వివరించారు. ఎంపికైన విద్యార్థులను ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రాజేశం, ఉపాధ్యాయులు మునీందర్, వ్యాయామ ఉపాధ్యాయుడు బైకని కొమురయ్య, సంజీవరావు అభినందించారు.

ఓటుహక్కుపై దీపోత్సవం



గోదావరిఖని: ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరుతూ స్వీప్ ఆధ్వర్యంలో గురువారం దీపోత్సవం నిర్వహించారు. ప్రతి ఒక్కరూ ఓటుహక్కు వినియోగించుకోవాలని అవగాహన సదస్సు, ప్రజా చైతన్యయాత్ర చేపట్టారు. నగరంలోని స్థానిక ప్రధాన చౌరస్తా, కస్తూర్బానగర్, మసీద్ ఏరియాలో ప్రచారం నిర్వహించారు. రామగుండం రిటర్నింగ్ ఆఫీసర్ అరుణశ్రీ, మున్సిపల్ కమిషనర్ సీహెచ్ నాగేశ్వర్, మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ త్రయంబకేశ్వర్, మున్సిపల్ సూపరింటెండెంట్ మనోహర్, పీడీ రజనీ, స్వీప్ నోడల్ ఆఫీసర్ స్వరూపరాణి పాల్గొన్నారు.

నాయకత్వ లక్షణాలపై అవగాహన

- ఆరు విభాగాలకు వలంటీర్లుగా విద్యార్థుల ఎన్నిక
- ప్రోత్సహించిన సోషల్ టీచర్‌కు సన్మానం



వలంటీర్లను అభినందిస్తున్న హెచ్‌ఎం శారద



మనోహర్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయ బృందం

రామగుండం: పాఠశాల స్థాయిలోనే విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలను పెంపొందించాలనే ఉద్దేశంతో గురువారం పట్టణంలోని జిల్లా పరిషత్ హైస్కూల్ హెచ్‌ఎం అజ్మీరా శారద నేతృత్వంలో పలు అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ముఖ్యంగా మధ్యాహ్న భోజనం, తాగునీరు, క్రమశిక్షణ, స్వచ్ఛభారత్, ఆర్ట్స్, ఉపన్యాసం తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించి లీడర్లను ఎన్నుకున్నారు. మధ్యాహ్న భోజనంలో ఫుడ్ వేస్టేజీ నివారణ, వేస్టేజీ నిర్వహణ, విద్యార్థులందరిలో క్రమశిక్షణను పెంపొందించడం, స్వచ్ఛభారత్‌లో భాగంగా పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంలో విద్యార్థుల పాత్ర, సమాజంలో విద్యార్థుల ప్రవర్తన, వివిధ అంశాలపై ప్రసంగించే విధానాలు తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించినట్లు తెలిపారు. ఈ అంశాలపై ఎవరైతే చురుకుగా ఉంటారో వారిని గుర్తించి లీడర్లుగా ఎన్నుకున్నామన్నారు. వీటన్నింటిపై ప్రత్యేక శ్రద్ధ వహించిన సోషల్ ఉపాధ్యాయుడు కె.మనోహర్‌ను పాఠశాలలోని ఉపాధ్యాయుల బృందం సత్కరించింది. హెచ్‌ఎం శారద మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి చదువు ఎంత ముఖ్యమో సమాజంలో నాయకత్వ లక్షణాలు అంతకంటే ముఖ్యమని విద్యార్థులకు వివరించామన్నారు. ప్రతీ విద్యార్థి తన పాఠశాల స్థాయి చదువులు పూర్తయ్యాక ఉన్నత విద్యలోకి వెళ్లే క్రమంలో నాయకత్వ లక్షణాలు కలిగి ఉన్న విద్యార్థుల్లో ఎలాంటి భయం లేకుండా లెక్చరర్స్, తోటి విద్యార్థులతో ప్రతీ ఒక్కరితో సత్సంబంధాలు కలిగి ఉంటే అన్ని రంగాల్లో రాణించే అవకాశం ఉంటుందన్నారు. చదువుతో పాటు సామాజిక అంశాలపై దృష్టిసారించడంపై విద్యార్థుల్లో పాఠశాలకు గైర్హాజరు కాకుండా రావడంతో పాటు అన్ని రంగాల్లో విద్యార్థుల మధ్య పోటీతత్వం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నామినేషన్ సెంటర్ వద్ద పటిష్ట బందోబస్తు



నామినేషన్ కేంద్రం వద్ద సీఐలు, పోలీస్ సిబ్బంది

జ్యోతినగర్: రామగుండం అసెంబ్లీ ఎన్నికల రిటర్నింగ్ కార్యాలయం వద్ద పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. గురువారం ఎన్టీపీసీ రామగుండం టెంపరరీ టౌన్‌షిప్‌లోని ప్రభుత్వ జిల్లా ప్రజా పరిషత్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన రిటర్నింగ్ కార్యాలయం వద్ద రామగుండం సీఐ చంద్రశేఖర్‌గౌడ్, గోదావరిఖని సీఐ ప్రసాదరావుతో పాటు పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రధాన పార్టీలకు చెందిన అభ్యర్థులు కోరుకంటి చందర్, రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్, కందుల సంధ్యారాణితో పాటు పలువురు మొత్తంగా 12 మంది అభ్యర్థులు నామినేషన్లను దాఖలు చేశారు. దీంతో అభ్యర్థులకు సంబంధించిన వ్యక్తులు నామినేషన్ కేంద్రానికి 100 మీటర్ల దూరం ఉండాలనే నిబంధనలతో పాటు 144వ సెక్షన్ అమలును పకడ్బందీగా అమలు చేస్తున్నారు. బందోబస్తులో ఎస్సైలు, పోలీసులు పాల్గొన్నారు.

దళితులకు అన్యాయం



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

పెద్దపల్లిరూరల్: దళితుల సంక్షేమాన్ని సీఎం కేసీఆర్ సారథ్యంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం విస్మరించిందని కాంగ్రెస్ ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు కల్వల శ్రీనివాస్ ఆరోపించారు. పెద్దపల్లిలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దళితుల సంక్షేమం కోసం పథకాలను ప్రవేశపెట్టడమే తప్ప అర్హులకు అందించడం లేదని ఆరోపించారు. బీఆర్ఎస్ పాలనలో దళితులపై అఘాయిత్యాలు పెరిగాయని విమర్శించారు. దళితులంతా ఏకమై బీఆర్ఎస్ సర్కార్‌కు గుణపాఠం చెప్పాలని ఆయన కోరారు. నాయకులు వరప్రదీప్, దేవేందర్, రాజేశం, నర్సయ్య, శంకర్, హేమన్‌రాజ్ ఉన్నారు.

'ఖని' కోర్టులో న్యాయవిజ్ఞాన సదస్సు



సదస్సులో మాట్లాడుతున్న జడ్జి శ్రీనివాస్

గోదావరిఖనిటౌన్: జాతీయ న్యాయసేవా దినోత్సవం సందర్భంగా మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో గురువారం గోదావరిఖని అదనపు జిల్లా న్యాయస్థానంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా గోదావరిఖని అదనపు జిల్లా న్యాయమూర్తి డాక్టర్ టి.శ్రీనివాస్ హాజరై మాట్లాడారు. పేద ప్రజలకు బడుగు, బలహీన వర్గాలకు న్యాయం అందాలనే ఉద్దేశంతో కేంద్ర న్యాయశాఖ 1987లో నేషనల్ లీగల్ సర్వీస్ అథారిటీ(నల్సా)ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దీని ద్వారా దివ్యాంగులు, తెల్ల రేషన్‌కార్డుదారులు, వితంతువులు, వృద్ధులకు, ఉచిత న్యాయ సలహాలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే ఎలాంటి కోర్టు ఫీజు లేకుండా బాధితులకు ఉచిత న్యాయం అందిస్తున్నట్లు చెప్పారు. న్యాయ సలహాలు అవసరమైనవారు జిల్లాలోని ఆయా కోర్టుల్లోని న్యాయ సేవా కేంద్రాలను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి ఆర్.రాజ్‌కుమార్, జూనియర్ సివిల్ జడ్జిలు వెంకటేశ్ దుర్వ, దుర్గం గణేశ్, లోక్ అదాలత్ సభ్యులు మేడ చక్రపాణి, చందాల శైలజ, శంకర్, అదనపు జిల్లా కోర్టు ఏవో శ్రీనివాసరాజు, సూపరింటెండెంట్ శ్రీధర్, న్యాయవాదులు పాల్గొన్నారు.

మల్లన్న సన్నిధిలో ప్రత్యేక పూజలు



రవీందర్‌సింగ్‌కు జ్ఞాపిక బహూకరిస్తున్న ఆలయ డైరెక్టర్ శ్రీకాంత్‌గౌడ్

ఓదెల: ఓదెల మల్లికార్జునస్వామి దేవస్థానంలో సివిల్ సప్లయ్ కార్పొరేషన్ చైర్మన్ రవీందర్‌సింగ్ గురువారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు స్వాగతం పలికి అర్చన చేశారు. అనంతరం చైర్మన్ రవీందర్‌సింగ్‌ను శాలువాతో సన్మానించారు. ఆలయ డైరెక్టర్ మ్యాడగోని శ్రీకాంత్‌గౌడ్ ఆయనకు మల్లికార్జునస్వామి జ్ఞాపికను బహూకరించారు.

మట్టి నమూనా పరీక్షలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

రామగిరి: మండలంలోని కల్వచర్ల గ్రామంలో గురువారం రైతులకు మట్టి నమూనా పరీక్షలపై మల్లారెడ్డి యూనివర్సిటీకి చెందిన బీఎస్సీ వ్యవసాయ విద్యార్థులు అవగాహన కల్పించారు. మట్టి పరీక్షలు నిర్వహించి ఎలాంటి ఎరువులు వాడాలో. .భూమిలో పోషకాలపై అవగాహన కల్పించారు. కమాన్‌పూర్ ఏఈవో యాదగిరి శ్రీనివాస్, మాజీ జెడ్పీటీసీ గంట వెంకటరమణారెడ్డి, రైతులు రమేశ్, వినయ్, ఎల్లయ్య, శ్రీధర్, శంకర్ పాల్గొన్నారు.

ఓటుహక్కుతోనే సమూల మార్పులు



మాట్లాడుతున్న దాసరి ఉష

సుల్తానాబాద్: ప్రజలకు రాజ్యాంగం కల్పించిన ఓటుహక్కుతోనే సమూల మార్పులకు అవకాశం ఉంటుందని, ఓటుహక్కును సద్వినియోగం చేసుకోవాలని బీఎస్పీ అభ్యర్థి దాసరి ఉష కోరారు. గురువారం సుల్తానాబాద్ పట్టణంలోని పూసాలలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడంతో పాటు ప్రజలకు అవసరాలను తీర్చే నాయకుడే కావాలని, నిస్వార్థంగా సేవ చేసే నాయకుని ఎన్నుకోవాలని సూచించారు. కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు అవినీతి, అక్రమాలకు, కుటుంబ పాలనకు నిలయంగా మారాయని వాటిని తరిమికొట్టాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఓటు అనే ఆయుధంతో తగిన గుణపాఠం చెప్పాలన్నారు. కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా ఉపాధ్యక్షుడు తోట వెంకటేశ్‌పటేల్, సుల్తానాబాద్ మండల అధ్యక్షుడు బోయిని రంజిత్, మండల కోశాధికారి అల్లెపు చంద్రశేఖర్, పట్టణ అధ్యక్షుడు తోట మధు, పార్టీ నాయకులు మాజీ జెడ్పీటీసీ ఈర్ల కొమురయ్య, పెద్దపల్లి జెడ్పీటీసీ బండారి రామ్మూర్తి, సుల్తానాబాద్ వార్డ్ మాజీ మెంబర్లు జువాజి సంపత్, కొండ రజిత, రోహిత్, సంజీవ్, కొలిపాక లత, అల్లెపు శృతి, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లిలోని రంగంపల్లి, గుండంకట్ట విద్యుత్‌సబ్‌స్టేషన్ల పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏడీఈ సత్యనారాయణ తెలిపారు. ఉదయం 8గంటల నుంచి 11 గంటల వరకు సరఫరా ఉండదన్నారు. రంగంపల్లి, చందపల్లి, నిట్టూరు, నిమ్మనపల్లి, పెద్ద బొంకూర్, పెద్దకల్వల గ్రామ విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

కార్యకర్తలు అధైర్య పడొద్దు

సుల్తానాబాద్: కార్యకర్తలు బీజేపీ నిర్ణయానికి కట్టుబడి ముందుకు నడవాలని, అధైర్య పడొద్దని పార్టీ పట్టణ అధ్యక్షుడు కూకట్ల నాగరాజు అన్నారు. గురువారం పట్టణంలోని వేణుగోపాలస్వామి ఆలయంలో బూత్ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ అధిష్టాన వర్గం పార్టీని గెలిపించే అభ్యర్థికే టికెట్ ఇవ్వాలని ఆలోచనతో ఉన్నందున ఆలస్యం అవుతోందని, శుక్రవారం ప్రకటించే అవకాశం ఉందన్నారు. జిల్లా మహిళా మోర్చా ఉపాధ్యక్షురాలు వనజ, మహిళా మోర్చా అధ్యక్షురాలు కూకట్ల చంద్రకళ, మహిళా మోర్చా ఉపాధ్యక్షురాలు బుర్ర ఉమ మండల ఉపాధ్యక్షులు మెండ శంకరయ్య, ఓబీసీ మండల అధ్యక్షుడు చిట్టవేణి సదయ్య, మండల ప్రధాన కార్యదర్శి వేగోలపు మల్లికార్జున్, జిల్లా బీజేవైఎం కార్యదర్శి బుర్ర సతీశ్‌గౌడ్, పట్టణ ఉపాధ్యక్షుడు మాటూరి లత, ఎనగందుల సతీశ్, ప్రధాన కార్యదర్శి గజబీంకార్ పవన్ పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయంలో ప్రత్యేక పూజలు



మాల వేస్తున్న పూజారి ప్రదీప్‌కుమార్

సుల్తానాబాద్: పట్టణంలో అయ్యప్పస్వామి ఆలయంలో అయ్యప్ప దీక్ష తీసుకునేవారు మాలను కేరళ గురుస్వామి కుసుమ ప్రదీప్‌కుమార్ ద్వారా తీసుకున్నారు. గురువారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహాగణపతి హోమం, అష్టాభిషేకం, ఆశీర్వాదం, దీపారాధన, మలికపురాణం, భగవతి సేవా, లలిత సహస్రనామ పారాయణం మహిళలతో చేయించారు. అనంతరం హాజరైన భక్తులందరికీ వారు తీర్థప్రసాదాలు అందజేశారు.

ప్రమాదకరంగా గుంత



సుల్తానాబాద్: పట్టణంలోని ఎంపీడీవో మూలమలుపు వద్ద గుంతలు పడడంతో ప్రమాదంగా మారిందని వాహనదారులు ఆరోపిస్తున్నారు. రాత్రివేళల్లో ప్రమాదాలకు గురవుతున్నారని వాహనదారులు తెలిపారు. మూలమలుపు వద్ద గుంత ఏర్పడకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు వెంటనే గుంతను పూడ్చివేయించాలని ప్రజలు కోరుతున్నారు.

ఇసుక లారీలను అడ్డుకున్న రైతులు

సుల్తానాబాద్‌రూరల్: సుల్తానాబాద్ మండలంలోని గట్టెపల్లి మానేరు వాగుపై ఏర్పాటు చేసిన ఇసుక రీచ్ నుంచి వస్తున్న లారీలను గురువారం రైతులు అడ్డుకున్నారు. రైతులు తెలిపిన వివరాల ప్రకారం సంబంధిత ఇసుక రీచ్ యాజమాన్యం తమ పంట పొలాలను లీజ్ తీసుకున్నారు. దానికి సంబంధించిన డబ్బులు ఇవ్వలేదని ఇసుక లారీలను అడ్డుకున్నట్లు తెలిపారు. అనంతరం ఇసుక రీచ్ యాజమాన్యం రైతులతో మాట్లాడి సముదాయించి డబ్బులు ఇస్తామని చెప్పినట్లు సమాచారం.